# ఎన్నికల నియమావళిని పాటించాలి : కలెక్టర్

మామిళ్లగూడెం, అక్టోబర్ 10: అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశం మందిరంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా, ఎన్నికల నియమావళిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలు తప్పని సరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడవద్దసూచించారు. జిల్లాలో 18-19 సంవత్సరాల వయస్సు గల వారు 44 వేల మంది ఓటర్లు కొత్తగా నమోదైనట్లు తెలిపారు. ఇంకా కొత్తగా ఓటరు నమోదుకు అర్హత గల వారిని వెంటనే నమోదు చేసుకునేలా చూడాలన్నారు. నామినేషన్ల తర్వాత ఈవీఎంలను నియోజకవర్గాలకు తరలిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం రఘునాథపాలెం మండలం జింకల తండాలోని గోడౌన్లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పూర్తి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. 1950 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సివిజిల్ యాప్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 40 వేల ఎపిక్ కార్డులు రాగా, ఆయా ఓటర్లకు అందజేసినట్లు, మరో 60 వేల ఎపిక్ కార్డులు త్వరలో రానున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఎపిక్ కార్డు రాని వారు, ఓటరు లిస్టులో తమ పేరు ఉందా లేదా చూసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్ల జాబితా రాజకీయ పక్షాలు వెంటనే సమర్పించాలన్నారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, వీడియోగ్రాఫర్, పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, పార్టీల ప్రతినిధులు నల్లమోతు తిరుమలరావు, జివిఎస్‌ఆర్‌ఏ.విద్యాసాగర్, పొన్నం వెంకటేశ్వరరావు, బాలగంగాధర తిలక్, లింగబోయిన సతీశ్, కె.కరుణాకర్, సీహెచ్.నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

### కంట్రోల్ రూమ్ తనిఖీ

మామిళ్లగూడెం, అక్టోబర్ 10: నూతన కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్ మంగళవారం తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల వివరాలు, సంప్రదించాల్సిన నెంబర్లను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. ఏ ఫిర్యాదు, ఏ అధికారికి చేయాలో ప్రోటోకాల్ చార్ట్‌ను ప్రదర్శించాలని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950, 9063211298కు కాల్ చేసి ఫిర్యాదులు, సందేహాలు పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, సీపీవో ఏ.శ్రీనివాస్, ఉర్దూ అధికారి ఎం.తిరుపతి, రజిత తదితరులు ఉన్నారు.

## ఎన్నికల వ్యయ పర్యవేక్షణ పటిష్టంగా చేయాలి

### జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, అక్టోబర్ 10: ఎన్నికలు స్వేచ్ఛ, న్యాయబద్ధంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో వ్యయ పర్యవేక్షణ అమలు కమిటీ సమావేశాన్ని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో డబ్బు, మద్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విజిలెన్స్ కమిటీ క్రియాశీలకంగా ఉన్నదని, ఆదాయ పన్ను, జీఎస్టీ విభాగాలు ఎన్నికల్లో తమ కార్యాచరణ నివేదిక సమర్పించాలన్నారు. సీపీ విష్ణు మాట్లాడుతూ.. బల్క్ విత్ డ్రాయల్, ఒకే అకౌంట్ నుంచి చాలా అకౌంట్లకు మనీ ట్రాన్స్‌ఫర్ విషయంలో బ్యాంకర్లు సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, వ్యయ పర్యవేక్షణ జిల్లా నోడల్ అధికారి సాయికుమార్, జిల్లా రవాణాధికారి కిషన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారిణి విజయకుమారి, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, ఏసీపీ గణేష్, అధికారులు పాల్గొన్నారు.


తనిఖీ బృందాల వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

### ఎన్నికల తనిఖీ బృందాల వాహనాలు ప్రారంభం

మామిళ్లగూడెం, అక్టోబర్ 10: నూతన కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను కలెక్టర్ గౌతమ్ పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 15 ఫ్లయింగ్ స్క్వాడ్, 24 ఎంసిసి,15 ఎస్‌ఎస్టి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఆర్డీవో విద్యాచందన, సీపీవో ఏ. శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రింటింగ్ ప్రెస్ పేరు, అడ్రస్ కచ్చితంగా ఉండాలి

### ఖమ్మం నియోజవర్గం ఆర్‌వో ఆదర్శ్ సురభి



ఖమ్మం, అక్టోబర్ 10: ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీలు ప్రింట్ చేసే వారు తామ ప్రింట్ చేసే దానిపై ఖచ్చితంగా ప్రింటర్ పేరు, మొబైల్ నెంబర్ కనిపించేలా ప్రింట్ చేయాలని ఖమ్మం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కేఎంసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నగరంలోని ప్రింటింగ్, ఫ్లెక్సీలు, డీటీపీ నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రింటింగ్ ప్రెస్ వాళ్లు ఎన్ని ప్రింట్ చేశారు.. ఏ పబ్లిషర్‌కి ప్రింట్ చేశారు.. అనే వివరాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కి తక్షణమే అందజేయాలని ఆదేశించారు. అడ్రస్ లేకుండా ప్రింట్ చేస్తే అధికారులే వారి వివరాలు తెలుసుకొని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్, అక్టోబర్ 10: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి 6 నెలల జైలు, 48లక్షలు ఫిర్యాదుదారులకు చెల్లించాలని ఖమ్మం మూడో అదనపు మేజిస్ట్రేట్ వినుకొండ మాధవి మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెనికి చెందిన గుడిచుట్టు నరేందర్ వద్ద నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్ అల్లాడి శ్రీధర్ తన హాస్పిటల్ అభివృద్ధి కోసం 2014 సెప్టెంబర్ 25న 48 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదే రోజు ప్రామిసరి నోటు రాసిచ్చాడు. కొంతకాలం తర్వాత నేరందర్ డబ్బు చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2016 సెప్టెంబర్ 23న 48 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును నరేందర్ తన బ్యాంకు ఖాతాలో జమచేయగా, శ్రీధర్ ఖాతాలో సరిపడ డబ్బు లేనందున చెక్కు నిరాధరణకు గురైంది. ఫిర్యాద్‌దారుడు తన న్యాయవాది వేగినాటి నాగేశ్వరరావు ద్వారా లీగల్ నోటీసు జారీ చేసినా నిందితుడు డబ్బు చెల్లించకపోవడంతో కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. ఇరుపక్షాల వాదనలు కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

## డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బీవీపై విచారణ..!

ఖమ్మం సిటీ, అక్టోబర్ 10: జిల్లా సార్వజనీన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లుపై విచారణ జరుగుతోంది. కొంత కాలంగా ఆయనపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదేశానుసారం మంగళవారం ఇద్దరు వైద్యుల బృందాన్ని ఖమ్మానికి పంపారు. నకిరేకల్ ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత, నల్లగొండ డెర్మటాలజిస్ట్ డాక్టర్ జయ్‌కుమార్ తొలుత జిల్లా ఆసుపత్రికి, తర్వాత ఐడీవోసీలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ బీవీపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. కరోనా సమయంలో అనధికారికంగా వైద్యులను నియమించారన్న సమాచారంపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో లభించిన ఆధారాలు, పెద్దాసుపత్రి యంత్రాంగం ఇచ్చిన వివరణలను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

# ఖమ్మం అర్బన్‌లో ఆరోగ్యలక్ష్మి సక్సెస్

**రోజుకు 6వేల మందికి పోషకాహారం**

**తల్లీపిల్లలకు అందుతున్న సంపూర్ణ ఆరోగ్యం**

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా రోజూ ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం, ఖమ్మం నగరంలో 6 వేల మందికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందుతున్నది. ఉమ్మడి పాలనలో కేవలం ఏజెన్సీ ప్రాజెక్టులకే పరిమితమైన మధ్యాహ్న భోజనం నేడు అర్బన్‌లోని అన్ని సెక్టార్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చింది. రోజూ క్రమం తప్పకుండా వివిధ రకాలైన రుచికరమైన భోజనం, కోడి గ్రుడ్డు, 200 గ్రాములు చొప్పున పాలు అందిస్తున్నారు. తద్వార కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరుశాతం పెరిగింది. స్థానిక ఏఎన్ఎం, ఆశాశ కార్యకర్తల ద్వారా వారికి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఐసీడీఎస్‌తోపాటు చైల్డ్‌లైన్-1098, బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలి, సఖీ సెంటర్, ప్రత్యేక పోలీస్ విభాగాలు పని చేస్తున్నాయి. చిన్నారుల్లో లోప పోషణ, రక్తహీనత, తదితర సమస్యలు అధిగమించేందుకు పోషణ్‌అభియాన్ అందుబాటులోకి వచ్చింది.


కేంద్రంలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు (ఫైల్)

### ఆరోగ్యలక్ష్మి రాకతో కనుమరుగైన కాన్వెంట్లు

ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రాజెక్టు పరిధిలో మొత్తం 11 సెక్టార పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 2,082 మంది గర్భిణులు, 1,788 బాలింతలతోపాటు, 2,121 మంది ప్రీ స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసు గల పిల్లలకు బాలామృతంంతో పాటు రోజూ విడిచి రోజు గ్రుడ్డు అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ ఒక కోడిగుడ్డు, 200 గ్రాముల పాలతో పాటు రోజుకో రకమైన భోజనాన్ని అందిస్తున్నారు. ప్రీ స్కూల్ (3-5 సంవత్సరాల లోపు) చిన్నారులకు ఆంగ్ల బోధన చేసేందుకు ప్రత్యేక శిక్షణ సైతం ఇవ్వడం జరిగిది. దీంతో కేంద్రాల్లోనే చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేయించి సమీప పాఠశాలలో చేరుస్తున్నారు. గతంలో కాలనీకి ఒకటి చొప్పున ఉన్న కాన్వెంట్లు పూర్తిగా మూతపడ్డాయి.

### కేంద్రాలు చాలా బాగున్నాయి



నాటి అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటి అంగన్‌వాడీ కేంద్రాలకు చాలా తేడా ఉంది. కేంద్రాలకు రోజూ గర్భిణులు, బాలింతలు వస్తున్నారు. కేంద్రాల్లో భోజనంతో పాటు, గ్రుడ్లు, పాలు కూడా ఇస్తున్నారు. బాలింతల ఆరోగ్యం పట్ల మంచి శ్రద్ధ తీసుకుంటున్నారు. **- ముదిగొండ ఉమాదేవి, ఖమ్మం**

## కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవో నాయకులు


కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఖమ్మం, అక్టోబర్ 10: కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్, కార్యదర్శి ఆర్‌వీఎస్.సాగర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం జిల్లా కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమర్షియల్ ట్యాక్స్ శాఖలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు ఎండీ. మజీద్, అనుదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందగిరి శ్రీను , మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, ఖమ్మం రూరల్, వైరా , కల్లూరు యూనిట్ల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, శివస్వప్న, సవర్జన్ పాల్, మెడికల్ ఫోరం అధ్యక్షుడు బుద్దా రామకృష్ణ, జిల్లా బాధ్యులు వై.శ్రీనివాసరావు, హాస్పిటల్ ఫోరం అధ్యక్షుడు ఫిరంగి శ్రీను, డిగ్రీ కాలేజీ ఫోరమ్ అధ్యక్షుడు గులాం అఫ్జల్, మహిళా విభాగం అఖిల తదితరులు పాల్గొన్నారు.